కారుణ్య మరణానికి అనుమతించండి

- బిల్లులు చెల్లించకపోతే మాకు చావే శరణ్యం
- కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి కాంట్రాక్టర్ల హెచ్చరిక
- రూ.738 కోట్ల బాకీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్

హవేరీ: కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారుపై ఆ రాష్ట్ర కాంట్రాక్టర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిద్ధరామయ్య సర్కారు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంపై వారు మండిపడుతున్నారు. తాము హవేరీ జిల్లాలో గడచిన కొన్ని సంవత్సరాల్లో చేసిన వివిధ పనుల నిమిత్తం తమకు దాదాపు రూ.738 కోట్లు చెల్లించవలసి ఉందని, ఈ సొమ్మును ఈ నెలాఖరుకు చెల్లించకపోతే, కారుణ్య మరణానికి అనుమతి కోరవలసిన పరిస్థితి వస్తుందని జిల్లా కాంట్రాక్టర్ల సంఘం హెచ్చరించింది. ఈ సంఘం నేత మల్లికార్జున్ హవేరీ ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, 'వివిధ శాఖల్లో కమీషన్ల బెడద విపరీతంగా ఉంది. అధికారులు, మధ్యవర్తులు 10-15 శాతం కమీషన్ తీసుకుంటున్నారు. ఇప్పటివరకు దాదాపు 10 మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సహా అన్ని శాఖల్లో కమీషన్ల బెడద ఉంది. అధిక వడ్డీలకు అప్పు చేసి మరీ కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారు. బిల్లులు విడుదల చేస్తారని కమీషన్లు చెల్లిస్తున్నాం. మధ్యవర్తులు మా రక్తం తాగుతున్నారు' అని పేర్కొన్నారు.

మంత్రి హామీ ఏమైంది?

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరిగే సమయంలో బెళగావిలో కాంట్రాక్టర్లు నిరసనలు చేపట్టారని, దశలవారీగా మార్చి చివరి నాటికి బిల్లులు చెల్లిస్తామని ప్రజా పనుల శాఖ మంత్రి హామీ ఇచ్చారని మల్లికార్జున్ హవేరీ చెప్పారు. అయితే ఇప్పటికీ బిల్లులు మంజూరు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం తమ బిల్లులను మంజూరు చేయాలని లేదా కారుణ్య మరణానికి అనుమతించాలని స్పష్టంచేశారు.

మునుపటి బీజేపీ హయాంలోనూ..

మునుపటి బీజేపీ ప్రభుత్వ హయాంలోనూ కాంట్రాక్టర్లు పలుమార్లు నిరసనలు చేపట్టారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో పలువురు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు. కారుణ్య మరణానికి అనుమతించాలని రాష్ట్రపతి, ప్రధానికి కాంట్రాక్టర్లు లేఖలు రాశారు. బీజేపీ సర్కారు దిగిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా వారి పరిస్థితిలో మార్పు రావడం లేదు. పైగా, మునుపటి సర్కారుతో పోలిస్తే సిద్ధరామయ్య ప్రభుత్వంలో అవినీతి మరింత పెరిగిందని వారు వాపోతున్నారు. డీకే శివకుమార్ సహా పలువురు మంత్రుల ఆఫీసుల్లో అవినీతి పెచ్చుమీరిందని, బ్రోకర్లతో ఆఫీసులు నిండిపోయాయని మండిపడుతున్నారు.

వరద కాలువ పనుల్లో డీకేకు కమీషన్లు

బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న ఆరోపణ

బెంగళూరు: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ వరద కాలువ పనుల్లో 15 శాతం కమీషన్ వసూలు చేశారని బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని సంస్థలకు కాంట్రాక్టులను కట్టబెట్టారని తెలిపారు. ఈ పనుల కోసం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుంచి రూ.2,000 కోట్ల రుణం తీసుకుంటున్నదని చెప్పారు. తాను మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తానని తెలిపారు. ఆయన ఆదివారం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను కలిసి ఈ అవినీతిపై దర్యాప్తు జరిపించాలని కోరారు. టెండర్ల ప్రక్రియలో అక్రమాల గురించి ఆయన గతంలో లోకాయుక్త, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐలకు కూడా ఫిర్యాదు చేశారు.

టీనేజర్‌పై గ్యాంగ్ రేప్

- నిందితుల్లో బీజేపీ యువనేత!
- యూపీలో దారుణం

కాస్‌గంజ్: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో 16 ఏండ్ల బాలిక గ్యాంగ్ రేప్‌కు గురైంది. బాలిక ఈ నెల 10న తనకు కాబోయే భర్తతో కలిసి కాస్‌గంజ్ జిల్లాలోని హజారా కెనాల్ పక్కన ఉండగా ఈ దారుణం జరిగింది. 10 మంది నిందితుల్లో 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. 'కొంతమంది మొదట మాపై అశ్లీల వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత నా కాబోయే భర్తను కొట్టి, నన్ను బలవంతంగా కెనాల్ పక్కన జన సంచారం లేని గదిలోకి తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరు లైంగిక దాడికి పాల్పడ్డారు. నా చెవి కమ్మలు, డబ్బులు తీసుకున్నారు' అని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలిని వైద్య పరీక్షలకు పంపారు. మొదట బాధితురాలు ఘటనపై ఫిర్యాదు చేయలేదు. అయితే ఆరోగ్యం క్షీణించడంతో తన తల్లికి విషయాన్ని తెలియజేసింది. లైంగిక దాడి ఘటనను విపక్షాలు ఖండించాయి. నిందితుల్లో ఒక బీజేపీ యువనేత ఉన్నారని.. అతడికి ఒక ఎమ్మెల్యేతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని కాంగ్రెస్, తృణమూల్ ఆరోపించాయి.

నిందితుడిని వదిలి జడ్జి కోసం గాలింపు!

యూపీలో ఓ ఎస్ఐ నిర్వాకం

లక్నో: దొంగతనం కేసులో నిందితుడిని పట్టుకోవాలని ఆదేశించిన జడ్జినే పట్టుకునేందుకు ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రయత్నించారు. దీంతో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ ఎస్ఐపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాల్లోకి వెళితే, ఉత్తర ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో 2012లో ఓ దొంగతనం జరిగింది. నిందితుడు రాజ్ కుమార్ వురపు పప్పు అనేక నాన్ బెయిలబుల్ వారంట్లను పట్టించుకోలేదు. అరెస్ట్ నుంచి, కోర్టుకు హాజరుకావడం నుంచి తప్పించుకుంటున్నాడు. అతనిని ప్రకటిత నేరస్థుడిగా తీర్పు చెప్పేందుకు సీఆర్‌పీసీ సెక్షన్ 82 ప్రకారం చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నగ్మా ఖాన్ ఆదేశాలు జారీ చేశారు. అతని కోసం వెతకవలసిన ఎస్ఐ భన్వరిలాల్ జడ్జి నగ్మా ఖాన్ కోసం వెతికారు. ప్రొక్లమేషన్ ఆర్డర్‌ను నాన్‌బెయిలబుల్ వారంట్‌గా, జడ్జినే నిందితుడిగా భావించారు. దీనిలో పేర్కొన్న చిరునామాలో నగ్మా ఖాన్ లేరని రాసి, నివేదికను కోర్టుకు సమర్పించారు. ఈ విషయం తెలిసి జడ్జి అవాక్కయ్యారు.

అమెరికన్‌ని పెండ్లి చేసుకున్నా..

పౌరసత్వం అంత ఈజీ కాదు!

- ఇమిగ్రేషన్ నిబంధనలు మరింత కఠినతరం
- వివాహ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి
- జీవిత భాగస్వామి పుట్టుపూర్వోత్తరాలపై ఆరా
- ఇంటర్వ్యూలో సమగ్ర వివరాలు చెప్పాల్సిందే

వాషింగ్టన్, ఏప్రిల్ 14: అమెరికా పౌరసత్వం లేదా గ్రీన్‌కార్డు ఉన్న వ్యక్తిని వివాహం చేసుకుని అమెరికాలో స్థిరపడాలని కలలు కనే వలసవాదారుల ఆశలు ఇక అంత సులువుగా నెరవేరే అవకాశం లేదు. అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాకు వచ్చే వీసాదారులపై ఆంక్షలు కఠినతరం చేస్తున్న కారణంగా బైడెన్ పాలనకు పూర్తి భిన్నంగా పరిస్థితులు మారిపోతున్నాయి. గ్రీన్ కార్డు కలిగిన వ్యక్తిని వివాహం చేసుకున్న భాగస్వామికి గతంలో ఇంటర్వ్యూలను సైతం పక్కనపెట్టి గ్రీన్‌కార్డు మంజూరు చేసిన రోజులు ఉన్నాయి. కాని ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. దరఖాస్తు ప్రక్రియ దశలోనే జల్లెడ పడుతూ ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్న పరిస్థితి కనపడుతోంది. జీవిత భాగస్వామికి సంబంధించిన ఆహార, నిద్ర అలవాట్లు, అలర్జీలు, ఇష్టాయిష్టాలు తదితర అంశాల గురించి గ్రీన్‌కార్డు దారునికి ఏమాత్రం అవగాహన ఉందో అధికారులు ఆరా తీస్తూ ధ్రువీకరణ పత్రాలన్నిటినీ నిశితంగా పరిశీలిస్తున్నారు. బైడెన్ పాలనకు భిన్నమైన పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయని, అధికారులు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా నిర్ధారించుకుంటున్నారని, వివాహానికి సంబంధించిన సాక్ష్యాలను అత్యంత నిశితంగా పరిశీలిస్తున్నారని ఇమిగ్రేషన్ అటార్నీ అశ్విన్ శర్మ వెల్లడించారు.

భాగస్వామి వివరాలు సంపూర్ణంగా తెలిసుండాలి..

గ్రీన్‌కార్డుకు ఆమోదం లభించాలంటే అత్యంత క్లిష్టమైనది ఇంటర్వ్యూను ఎదుర్కోవడం. అమెరికా వెలుపల నివసిస్తూ గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసే జీవిత భాగస్వామికి అమెరికా కాన్సులేట్ అధికారులు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఉదాహరణకు హెచ్-1బీ వీసాపై అమెరికాలో ఉంటూ గ్రీన్‌కార్డుదారుని వివాహం చేసుకున్న భాగస్వామి తన హోదాను గ్రీన్‌కార్డుగా మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకున్నపుడు వారికి యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది. ఇంటర్వ్యూలో తమ జీవిత భాగస్వామికి సంబంధించిన అన్ని విషయాలను సంపూర్ణంగా తెలుసుకుని జవాబివ్వాలని ఇమిగ్రేషన్ న్యాయవాదులు హెచ్చరిస్తున్నారు. వివాహానికి సంబంధించిన పక్కా సాక్ష్యాలు సమర్పించాలని తమను అధికారులు కోరుతున్నారని, త్వరలో ఇది అధికారిక విధానం అయ్యే అవకాశం ఉందని అటార్నీ శర్మ చెప్పారు. పెళ్లయిన జంటకు సంబంధించి వారు ఎప్పుడు ఎక్కడ కలుసుకున్నారు, కలసి ఎందుకు జీవించాలనుకుంటున్నారు, వారి మధ్య అనుబంధం ఎలా ఉంది తదితర దాంపత్యానికి సంబంధించిన వివరాలను కూడా అధికారులు కూపీ లాగుతున్నారని శర్మ తెలిపారు. కాన్సులర్ కేసులలో వీసా ఇంటర్వ్యూకు అమెరికా పౌరసత్వం ఉన్న వ్యక్తిని అనుమతించనందున ధ్రువీకరణ పత్రాలపైనే మొత్తం ప్రక్రియంతా ఆధారపడి ఉంటుందని తెలిపారు. ధ్రువీకరణ పత్రాలే వారి వివాహ బంధాన్ని గురించి రుజువు చేయాల్సి ఉంటుంది. దంపతుల మధ్య వివాహం జరిగిన తీరు, వారి మధ్య ఉన్న అనుబంధం, ఎడబాటులో ఉన్నా వారి బంధం కొనసాగుతున్న తీరు, ఇందుకు సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలు వంటి కమ్యూనికేషన్‌కు సంబంధించిన సాక్ష్యాలు, ఉభయులకూ సంబంధించిన సందర్శనలు, వివాహం విషయంలో రెండు కుటుంబాల ప్రమేయం వంటి వివరాలన్నిటినీ పక్కా సాక్ష్యాధారాలను పరిశీలించి మరీ ఇమిగ్రేషన్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు అటార్నీ చెప్పారు.

వివాహం బోగస్ అని తేలితే..

వివాహమైనట్టు రుజువు చేసే ధ్రువీకరణ పత్రాలతోపాటు నగదు బదిలీ రసీదులు, మొబైల్ కాల్స్ వివరాలు, ఫొటోలు, జాయింట్ బ్యాంకు అకౌంట్లతోపాటు జాయింట్ లైఫ్ ఇన్సూరెన్సు పాలసీలను సైతం చూపించాల్సి ఉంటుందని ఎన్‌పీజెడ్ లా గ్రూపు మేనేజింగ్ అటార్నీ స్నేహల్ బాత్రా తెలిపారు. వీటితోపాటు జీవిత భాగస్వామి ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం, జీతం, విద్య, పూర్వ వివాహం ఏదైనా ఉంటే అందుకు సంబంధించిన వివరాలతోసహా వైవాహిక బంధానికి సంబంధించిన అన్ని ప్రశ్నలకు ఇంటర్వ్యూలో సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని బాత్రా చెప్పారు. వివాహం బోగస్‌దని తేలి గ్రీన్ కార్డు దరఖాస్తు నిరాకరణకు గురైన పక్షంలో అమెరికాలోనే భాగస్వామి ఉన్న పక్షంలో స్వదేశానికి వెళ్లిపోవలసి ఉంటుందని బాత్రా హెచ్చరించారు.

ఐఎస్ఎఫ్ మద్దతుదారులు నిప్పు పెట్టడంతో కాలిపోతున్న పోలీసుల వాహనాలు

బెంగాల్‌లో వక్ఫ్ నిరసనలు ఉధృతం

దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఆందోళనలు.. పోలీస్ వాహనాలకు నిప్పు

కోల్‌కతా: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు పశ్చిమ బెంగాల్‌లో విస్తరిస్తున్నాయి. ముర్షీదాబాద్‌లో హింసాత్మక నిరసనల తర్వాత తాజాగా దక్షిణ 24 పరగణాల జిల్లాకు విస్తరించాయి. భంగర్‌లో ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్(ఐఎస్ఎఫ్) మద్దతుదారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. పోలీసు వాహనాలను తగులబెట్టారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు గాయపడ్డారు. నిరసనకారులు హైవేపై బైఠాయించడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది.

ఆంగ్ల పాఠ్య పుస్తకాలకు హిందీ పేర్లు

ఎన్‌సీఈఆర్‌టీ తీరుపై విమర్శలు

న్యూఢిల్లీ: ఆంగ్ల మాధ్యమంలోని కొత్త పాఠ్య పుస్తకాలకు ఎన్‌సీఈఆర్‌టీ రోమన్ లిపిలో హిందీ పేర్లను పెట్టడం వివాదాస్పదమైంది. ఆయా భాషా మాధ్యమ పుస్తకాలకు ఆయా భాషల్లోనే పేర్లను పెట్టే సంప్రదాయాన్ని తాజా చర్యలు ఉల్లంఘించాయి. ఉదాహరణకు ఆరో తరగతి ఆంగ్ల పాఠ్య పుస్తకానికి గతంలో హనీసకల్ అనే పేరుండేది. ఇప్పుడు ఆ పేరును పూర్వీగా మార్చారు. ఒకటి, రెండో తరగతుల పాఠ్య పుస్తకాల పేర్లను మృదంగ్ అని, మూడో క్లాస్ పుస్తకాల పేరును సంతూర్ అని మార్చారు. తమిళనాడు లాంటి రాష్ట్రాలు త్రిభాషా విధానం అమలును వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ మార్పులు చోటు చేసుకోవడం గమనార్హం. ఆంగ్ల మాధ్యమ పుస్తకాలకు హిందీలో పేర్లు పెట్టడాన్ని కేరళ విద్యా శాఖ మంత్రి శివన్‌కుట్టి వ్యతిరేకించారు. భాషా వైవిధ్యాన్ని దెబ్బ తీశారని అన్నారు.

ట్రంప్ హత్యకు డబ్బివ్వలేదని చంపేశాడు!

అమెరికాలో తల్లిదండ్రులను హత్య చేసిన టీనేజర్ అరెస్ట్

మల్‌వౌకీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేయడానికి అవసరమయ్యే డబ్బు కోసం నికిత కాసాప్ (17) తన తల్లిదండ్రులను చంపేశాడు. ఇటీవల జారీ అయిన ఫెడరల్ వారంట్ ప్రకారం, నికిత తన తల్లి తాతియానా (35), సవతి తండ్రి డొనాల్డ్ మేయర్ (51)లతో కలిసి మిల్‌వౌకీ శివారులో ఉంటున్నాడు. వీరిద్దరినీ ఫిబ్రవరిలో ఇంట్లోనే కాల్చి చంపేశాడు. శవాలు కుళ్లిపోయే వరకు కొన్ని వారాలపాటు అక్కడే ఉన్నాడు. అనంతరం 14,000 డాలర్ల నగదు, పెంపుడు కుక్క, పాస్‌పోర్టులను తీసుకుని పారిపోయాడు. అతనిని కాన్సాస్‌లో గత నెలలో అరెస్ట్ చేశారు. ట్రంప్‌ను హత్య చేయడానికి డ్రోన్, పేలుడు పదార్థాలు కొనడం కోసం తల్లిదండ్రుల వద్దనున్న డబ్బును వినియోగించాలనుకున్నాడు. ఈ ప్రణాళికను ఇతరులతో కూడా పంచుకున్నాడు. యూడు వ్యతిరేక మేనిఫెస్టోను సిద్ధం చేశాడు. టిక్‌టాక్, టెలిగ్రామ్ మెసెంజర్ యాప్‌లలో అతను జరిపిన సంభాషణలను కూడా పోలీసులు కోర్టుకు సమర్పించారు.

సుంకాలపై ఎవరికీ మినహాయింపుల్లేవ్

ట్రంప్ స్పష్టీకరణ

వాషింగ్టన్, ఏప్రిల్ 14: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలపై వెనక్కు తగ్గేది లేదని పునరుద్ఘాటించారు. చైనాతోసహా ఏ దేశానికి తన వాణిజ్య సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చే ప్రసక్తి లేదని ఆదివారం ఆయన స్పష్టం చేశారు. కొన్ని టెక్ ఉత్పత్తులపై తన ప్రభుత్వం సుంకాల మినహాయింపులు ఇచ్చినట్టు వస్తున్న వార్తలను సోషల్ మీడియా వేదికగా ట్రంప్ తోసిపుచ్చారు. అమెరికాను అత్యంత హీనంగా చూస్తూ అన్యాయమైన వాణిజ్య విధానాలకు పాల్పడుతున్న దేశాలు ప్రత్యేకంగా చైనాను తమ చిట్టా నుంచి తప్పించే ప్రసక్తి లేదని ఆయన ప్రకటించారు.

అమెరికాకు షాకిచ్చిన చైనా..

అమెరికాతో వాణిజ్య యుద్ధం ముదిరిన నేపథ్యంలో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటో తయారీ, ఏరోస్పేస్ తయారీదారులు, సెమికండక్టర్ కంపెనీలు, అనేక వినిమయ వస్తువుల తయారీలో అమెరికా కంపెనీలు ప్రధానంగా ఉపయోగించే ముడి పదార్థాలు, మ్యాగ్నెట్లు, ఖనిజాల సరఫరాను చైనా నిలిపివేసింది. కార్ల నుంచి క్షిపణుల వరకు అన్ని వస్తువుల తయారీలో కీలకంగా ఉపయోగించే మ్యాగ్నెట్ల ఎగుమతిని చైనా నిలిపివేసింది.

యుద్ధాన్ని ఆపేస్తే బందీలందరి విడుదల

హమాస్ ప్రకటన

గాజా: గాజాలో యుద్ధాన్ని నిలిపివేస్తామని హామీ ఇస్తే.. ఇజ్రాయెల్ బందీలందర్నీ విడుదల చేసేందుకు సిద్ధమని హమాస్ సోమవారం ప్రకటించింది. కైరోలో జరుగుతున్న కాల్పుల విరమణ ఒప్పందం చర్చల్లో అమెరికా తరపున మధ్యవర్తులుగా ఈజిప్ట్, ఖతార్ దేశాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తులకు పై విషయాన్ని హమాస్ ప్రతినిధులు తెలియజేసినట్టు వార్తలు వెలువడ్డాయి. 'గాజాలో యుద్ధాన్ని ఇజ్రాయెల్ పూర్తిగా ఆపేయాలి. దీనిపై అమెరికా గ్యారెంటీ ఇస్తే.. బందీలందర్నీ విడుదల చేస్తాం' అని హమాస్ అధికారి తహెర్ అల్ నును చెప్పారు. మానవతా సాయం ఎంట్రీ పాయింట్, గాజా స్ట్రిప్‌ను ఖాళీ చేసి ఇజ్రాయెల్ బలగాలు వెళ్లిపోవాలని ఆయన డిమాండ్ చేశారు.

భారత ప్రైవేట్ హజ్ కోటా 80% తగ్గింపు

శ్రీనగర్: భారత ప్రైవేట్ హజ్ కోటాను 80 శాతం తగ్గిస్తూ సౌదీ అరేబియా తీసుకున్న నిర్ణయంపై జమ్మూకశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 52,000 మంది భారత హజ్ యాత్రికులకు హజ్ స్లాట్స్‌ను రద్దు చేయడం ఆందోళనకరమని చెప్పారు. సౌదీ అధికారులను సంప్రదించాలని విదేశాంగ మంత్రి జైశంకర్‌ను ఎక్స్ వేదికగా ఒమర్ కోరారు. ఈ పరిణామాల వల్ల యాత్రికులు, టూర్ ఆపరేటర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ముఫ్తీ ఎక్స్‌లో స్పందించారు. వెంటనే విదేశాంగ శాఖ జోక్యం చేసుకోవాలని, సౌదీ ప్రభుత్వంతో సంప్రదించి, పరిష్కారం కోరాలని డిమాండ్ చేశారు.

గుజరాత్ తీరంలో 1800 కోట్ల డ్రగ్స్ సీజ్

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అరేబియా సముద్రంలో స్మగ్లర్లు పారేసిన రూ.1800 కోట్ల విలువైన 300 కిలోల మాదక ద్రవ్యాలను ఆ రాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్), భారత తీర ప్రాంత గస్తీ దళం స్వాధీనం చేసుకున్నాయి. ఈ నెల 12న అర్ధరాత్రి తాము నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో భారత సముద్ర సరిహద్దు రేఖ వద్ద ఈ డ్రగ్స్‌ను సీజ్ చేసినట్టు అధికారులు సోమవారం తెలిపారు. తీర ప్రాంత గస్తీ దళం నౌక రావడాన్ని గమనించిన స్మగ్లర్లు తమ పడవలోని డ్రగ్స్‌ను సముద్రంలో పారేసి పారిపోయారని వారు చెప్పారు.



అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో కళాకారుల ప్రదర్శన

ఎన్డీయేకు ఆర్ఎల్‌జేపీ గుడ్‌బై

పాట్నా: బీహార్ శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కీలక మిత్ర పక్షాన్ని కోల్పోయింది. ఆర్ఎల్‌జేపీ చీఫ్ పశుపతి కుమార్ పరాస్ మాట్లాడుతూ, ఎన్డీయేలో తమకు అన్యాయం జరిగిందని, తమది దళిత పార్టీ కావడమే దీనికి కారణమని చెప్పారు. అందుకే కూటమి నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. బీహార్‌లో ఎన్డీయే సమావేశాలు జరిగేటపుడు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జేడీయూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఇచ్చే ప్రకటనల్లో తాము పంచ పాండవులం అని చెప్పేవారని, తమ పార్టీ గురించి ప్రస్తావించే వారు కాదని అన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 243 స్థానాలకు తాము పోటీ చేస్తామన్నారు. బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

వాట్సాప్ డెస్క్‌టాప్ యూజర్లకు కేంద్రం అలర్ట్

సైబర్ దాడి జరగొచ్చని హెచ్చరిక

న్యూఢిల్లీ: వాట్సాప్ డెస్క్‌టాప్ వెర్షన్ వాడుతున్న విండోస్ యూజర్లు జాగ్రత్తగా ఉండాలని, సైబర్ దాడులు జరిగే అవకాశముందని 'సెర్ట్-ఇన్' (ఇండియన్ కంప్యూటర్ ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీమ్) తాజాగా హెచ్చరికలు జారీచేసింది. వాట్సాప్ డెస్క్‌టాప్ వెర్షన్‌లో కీలకమైన లోపాన్ని గుర్తించినట్టు తెలిపింది. సైబర్ నేరగాళ్లు స్పూఫింగ్ దాడులకు పాల్పడవచ్చునని, దీంతో యూజర్ల వ్యక్తిగత డాటా, సిస్టం సెక్యూరిటీ గల్లంతయ్యే ప్రమాదముందని తెలిపింది. యూజర్లు తమ వాట్సాప్ డెస్క్‌టాప్ వెర్షన్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సెర్ట్-ఇన్, మెటా సంస్థలు సూచించాయి. 2.23440.1 నుంచి 2.2450.6 వెర్షన్లు సైబర్ నేరగాళ్ల లక్ష్యంగా మారాయని తెలిపాయి.

నిన్ను ఇంట్లోనే చంపుతాం

సల్మాన్‌కు మళ్లీ బెదిరింపులు

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు మళ్లీ బెదిరింపులు వచ్చాయి. 'సల్మాన్ నిన్ను ఇంట్లోనే చంపుతాం లేదా నీ కారును బాంబుతో పేల్చేస్తాం' అంటూ సోమవారం ముంబైలోని వర్లి రవాణా శాఖ వాట్సాప్ నంబర్‌కు బెదిరింపు సందేశం వచ్చింది. దీంతో గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బెల్జియంలో మెహుల్ చోక్సీ అరెస్టు

- భారత ప్రభుత్వ అభ్యర్థన మేరకు అదుపులోకి
- పీఎన్‌బీకి రూ.13 వేల కోట్ల మోసం కేసులో నిందితుడు
- 2018లో దేశం విడిచి పరార్
- తమకు అప్పగించాలని అభ్యర్థించనున్న దర్యాప్తు సంస్థలు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) నుంచి రూ. 13,000 కోట్ల రుణాన్ని పొంది బ్యాంకును మోసం చేసిన కేసులో నిందితుడైన వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని తమకు అప్పగించాలని భారత ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు బెల్జియం అధికారులు అరెస్టు చేశారు. పీఎన్‌బీ కేసులో చోక్సీ రెండవ నిందితుడు కాగా మొదటి నిందితుడైన నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్ జైలులో ఉన్నాడు. చోక్సీని ఏప్రిల్ 12న(శనివారం) అరెస్టు చేసినట్టు బెల్జియం ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ ఆఫ్ జస్టిస్ అధికారులు ప్రకటించారు. చోక్సీ అరెస్టు కోసం సీబీఐ అభ్యర్థన పంపినట్టు వారు చెప్పారు. తదుపరి న్యాయపరమైన ప్రక్రియ కోసం చోక్సీని నిర్బంధంలో ఉంచినట్టు వారు చెప్పారు. న్యాయపరమైన సహాయం అతనికి అందుబాటులో ఉంటుందని తెలిపారు. వైద్య చికిత్స కోసం 2023 నవంబర్‌లో 65 ఏళ్ల చోక్సీ బెల్జియం చేరుకున్నాడు. 2018లో భారత్ నుంచి పారిపోయిన చోక్సీ ఆంటిగ్వా చేరుకుని ఆ దేశ పౌరసత్వం తీసుకున్నాడు. ఆ దేశంలో అతని భారత పౌరసత్వం కూడా చెల్లుబాటు అవుతుంది. గతంలో చోక్సీ చేసిన వాదనను పరిశీలించిన ఇంటర్‌పోల్ అతనిపై జారీచేసిన రెడ్ కార్నర్ నోటీసును నిలిపివేసింది. అయితే భారత దర్యాప్తు సంస్థలు మాత్రం భారత్, బెల్జియం మధ్య ఉన్న నేరస్థుల అప్పగింత ఒప్పందానికి అనుగుణంగా చోక్సీని తమకు అప్పగించాలని అభ్యర్థిస్తూ వస్తున్నాయి. ముంబైలోని ప్రత్యేక కోర్టు చోక్సీ అరెస్టుకు రెండుసార్లు వారెంట్లు జారీచేయగా వీటిని సీబీఐ బెల్జియం అధికారులకు అందచేసింది. ముంబైలోని పీఎన్‌బీ బ్రాడీ హౌస్ బ్రాంచ్‌లో రుణ మోసానికి పాల్పడినట్టు చోక్సీ, నీరవ్ మోదీ, వారి కుటుంబ సభ్యులు, ఉద్యోగులు, బ్యాంకు అధికారులపై 2018లో సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేశాయి. గీతాంజలి జెమ్స్ అనే సంస్థ పేరిట చోక్సీ, నీరవ్ మోదీ బ్యాంకులో రుణ మోసానికి పాల్పడినట్టు ఆరోపణలు నమోదయ్యాయి.

మహిళా సెలబ్రిటీల రోదసి యాత్ర

నింగిలోకి కేటీ పెర్రీ సహా ఆరుగురు అతివలు

వాషింగ్టన్, ఏప్రిల్ 14: అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన 'బ్లూ ఆరిజన్' సంస్థ మహిళా సెలబ్రిటీలతో చేపట్టిన అంతరిక్ష యాత్ర విజయవంతమైంది. అమెరికన్ గాయని కెటీ పెర్రీ, ప్రముఖ జర్నలిస్ట్ గేల్ కింగ్, జెఫ్ బెజోస్‌కు కాబోయే భార్య లారెన్ శాంచెజ్ సహా ఆరుగురు మహిళలు రోదసిలోకి వెళ్లి అక్కడ 10 నిమిషాలపాటు భార రహిత స్థితిని ఆస్వాదించారు. సోమవారం బ్లూ ఆరిజన్ చేపట్టిన 'న్యూ షెపర్డ్' రాకెట్ ప్రయోగం ద్వారా వారంతా అంతరిక్షంలోకి వెళ్లి వచ్చారు. పశ్చిమ టెక్సాస్ నుంచి ప్రయోగించిన న్యూ షెపర్డ్ రాకెట్, వ్యోమగాముల్ని భూ ఉపరితలానికి 106 కిలోమీటర్ల ఎత్తులోకి తీసుకెళ్లింది. అనంతరం వ్యోమనౌక పారాషూట్ల సాయంతో తిరిగి భూ వాతావరణంలోకి ప్రవేశించింది. ఈ రోదసి యాత్రలో భాగమైన వారంతా మహిళలే కావటం విశేషం. రోదసి పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'బ్లూ ఆరిజన్' ఈ